ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం హర్షణీయం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 27: తెలంగాణ ఆడబిడ్డ, ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టులో బెయిల్ లభించడం హర్షణీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీల నేతలు ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు బనాయించారని, కుట్రపూరిత ధోరణితో వ్యవహరించి ఇబ్బందులు పెట్టారన్నారు. న్యాయం ఎన్నటికైనా గెలుస్తుందన్న నమ్మకాన్ని సుప్రీంకోర్టు మరోమారు రుజువుచేసిందన్నారు. కనీస ఆధారాలు లేకుండా.. కవితను కేసులో ఇరికించారని, ఐదు నెలలుగా జైలులో పెట్టి మానసిక వేదనకు గురిచేశారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో మనోధైర్యంతో కవిత బయటకు రావడం సంతోషకరమన్నారు. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలని, మహిళలను కనీసం ఆధారం లేకుండా కేసుల్లో ఇరికించడం మంచిది కాదన్నారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడాన్ని కొన్ని రాజకీయ పార్టీల నేతలు జీర్ణించుకోలేక.. నోటికి వచ్చినట్లు ఆరోపణలకు దిగడం సిగ్గు చేటన్నారు. నిజం నిప్పులాంటిదని, న్యాయమే ఎప్పటికైనా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

గచ్చిబౌలిలో సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

శేరిలింగంపల్లి, ఆగస్టు 27: ఈడీ అక్రమంగా అరెస్ట్ చేసిన ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టులో బెయిల్ మంజూరైన సందర్భంగా మంగళవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ముందు టపాసులు పేల్చుతూ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ... కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే ఎమ్మెల్సీ కవితపై ఈడీ కేసులు బనాయించి జైలులో ఉంచారని, ఆలస్యమైనప్పటికీ న్యాయమే గెలిచిందన్నారు. కార్యక్రమంలో చెన్నంరాజు, నరేశ్, అంజమ్మ, జగదీశ్, యాదగిరి, డాక్టర్ సుదర్శన్, ఇమ్రాన్, రమేశ్ గౌడ్, అనిల్‌సింగ్, మధు, నరేశ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కడిగిన ముత్యంలా బయటికి ..

కార్పొరేటర్ రోజాదేవి

మియాపూర్, ఆగస్టు 27: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చెప్పినట్టుగానే ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా బయటకు వచ్చిందని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అన్నారు. కవితకు దేశ అత్యున్నత న్యాయస్థానం కోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు రోజాదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకు ధన్యవాదాలు తెలిపారు. ఏ ఆధారాలు లేకుండా కవితను జైల్లో పెట్టడం అత్యంత బాధాకరమన్నారు.

1 నుంచి 'పాజ్ అండ్ రిఫ్లెక్ట్' ఆర్ట్ ఎగ్జిబిషన్

కొండాపూర్, ఆగస్టు 27: కళలకు ప్రసిద్ధిగాంచిన హైదరాబాద్ నగరం మరో ప్రత్యేకమైన ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు వేదికగా నిలువనున్నది. ఢిల్లీ ఆర్ట్ మాగ్నమ్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆర్ట్ క్యూరేటర్ అన్నపూర్ణ 'పాజ్ అండ్ రిఫ్లెక్ట్' పేరిట మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నలుగురు విభిన్న కళాకారులతో సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఎగ్జిబిషన్‌లో కళాకారులు ధ్రువ్ పటేల్, దుష్యంత్, రఘు, ముఖ్తార్ అహ్మద్‌లు తమ ప్రత్యేకమైన కళాఖండాలను ప్రదర్శించనున్నారు. యాంత్రిక జీవనంలో జీవితాన్ని ఆనందంగా అనుభవించాలో తెలియజేస్తూ తమ కళాఖండాలను ప్రదర్శించనున్నారు.

సుహృత్ ట్రస్ట్ చేయూత

బాధితుడికి చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్

మాదాపూర్, ఆగస్టు 27: రోడ్డు ప్రమాదానికి గురై రెండు కాళ్లు, నడుము విరిగి మృత్యువుతో పోరాడుతున్న ఓ వ్యక్తి కుటుంబం జీవనోపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతుండటంతో సుహృత్ ట్రస్ట్ వారికి చేయూతగా నిలిచింది. హఫీజ్‌పేట్‌లోని సాయినగర్‌కు చెందిన సాయిలు(సాల్మాన్) ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై రెండు కాళ్లు, నడుము విరిగి మృత్యువుతో పోరాడుతూ రెండు నెలలపాటు మమత హాస్పిటల్‌లో శస్త్రచికిత్సలు చేయించుకున్నాడు. సాయిలు కుటుంబం జీవనోపాధిలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బంధువుల ద్వారా సమాచారం అందుకున్న సుహృత్ ట్రస్ట్ అధ్యక్షుడు కనకమామిడి నరేందర్ గౌడ్ మంగళవారం వారి నివాసానికి చేరుకొని రూ.40వేల విలువజేసే చెక్కును ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సుహృత్ ట్రస్ట్ సభ్యులు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మృతి

నాగేందర్‌రెడ్డి(ఫైల్)

కుత్బుల్లాపూర్,ఆగస్టు 27 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం... చింతల్ మాణిక్యనగర్ ప్రాంతానికి చెందిన ముల్లగంధ్ల నాగేందర్ రెడ్డి(31)మంగళవారం తనతోపాటు చిన్న మ్మ కొడుకు జితేందర్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై కుత్బుల్లాపూర్ నుంచి దూలపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలోని సుభాష్ నగర్ సాయికాంట సమీపంలో అతివేగంతో వచ్చిన టాటా ఏసీ వాహన డ్రైవర్ వెనకాల నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. ఇద్దరిని పేట్ బషీరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ నాగేందర్‌రెడ్డి మృతి చెందగా.. జితేందేర్‌రెడ్డి చికిత్స పొందుతున్నాడు. మృతుడి అన్న నరేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి టాటా ఏసీ వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సేవాలాల్ సేన మేడ్చల్ జిల్లా కమిటీ నియామకం

దుండిగల్,ఆగస్టు 27 : సేవాలాల్ సేన మేడ్చల్ జిల్లా కమిటీ మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నిజాంపేట్ ప్రాంతానికి చెందిన సభావాత్ రామచంద్రనాయక్‌తో పాటు మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా కేతావత్ సుధాకర్‌నాయక్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా మాలోత్ సునీతనాయక్‌ను నియామకమయ్యారు. తనపై నమ్మకంతో తనకు అప్పగించిన పదవీతో రాబోయే రోజుల్లో అన్ని జిల్లాల కమిటీలతోపాటు మండలాల కమిటీలను పూర్తి చేసి సంఘం బలోపేతం చేస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రునాయక్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవల సేన అధ్యక్షుడు రాంబాబునాయక్, త్రిసభ్య కమిటీ సభ్యులు చిన్న బాబునాయక్, ప్రేమ్‌చంద్‌నాయక్, సేవాలాల్ సంస్కృతిక జాతీయ అధ్యక్షులు బంజారా ఆదికవి డా.ఎస్సీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ దేవస్థానం వార్షికోత్సవం

దుండిగల్,ఆగస్టు 27:దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డీ.పోచంపల్లిలోని ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయం మొదటి వార్షికోత్సం మంగళవారం ఘనంగా జరిగింది. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నేతలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి : ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్యే గాంధీతో వైద్యాధికారులు

మియాపూర్, ఆగస్టు 27: సర్కారు దవాఖానలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సూచించారు. తగు పర్యవేక్షణ చేపట్టి ఆరోగ్య నియోజకవర్గంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నారు. శేరిలింగంపల్లి జోన్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ లాల్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ పూర్ణిమ, శేరిలింగంపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ నూతనంగా నియామకమైన సందర్భంగా ఎమ్మెల్యే గాంధీని మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అదేవిధంగా శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంహోహెచ్ డాక్టర్ శేఖర్‌రెడ్డి సైతం ఎమ్మెల్యే గాంధీని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. కొండాపూర్ ఏరియా దవాఖాన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానలలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి పేద ప్రజలకు తగు వైద్య సేవలందించాలని సూచించారు. ఆరోగ్యపరంగా ప్రజలకు చైతన్యవంతులను చేయాలని సూచించారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో పారిశుద్ధ్య సేవలు మరింత మెరుగుపడేలా కృషి చేయాలని సర్కిల్ వైద్యాధికారికి ఎమ్మెల్యే గాంధీ సూచించారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 27 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 17, వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 57, కాకరకాయ 26, బీరకాయ 28, క్యాబేజి 15, ఫ్రెంచ్ బీన్స్ 57, క్యారెట్ 50, కాలీఫ్లవర్ 18, దొండ 21, చిక్కుడు 45, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 25, క్యాప్సికం 45, ఆలుగడ్డ 38, కీరా 28, దోసకాయ 13, సొరకాయ 11, పొట్లకాయ 13, కందగడ్డ 50, ఉల్లిపొరక 35 , ఉల్లిగడ్డ 52, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 75, గుమ్మడికాయ 19, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 6 నుంచి 8, పచ్చి బఠాని 85, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 360, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

కూకట్‌పల్లి డిపోలో ఆర్టీసీ కార్మికుల నిరసన

ఆర్టీసీకిచ్చిన ఆరు గ్యారంటీలు అమలుపర్చాలని డిమాండ్

కూకట్‌పల్లి డిపోలో నిరసన తెలుపుతున్న కార్మికులతో తెలంగాణ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్‌గౌడ్

బాలానగర్, ఆగస్టు 27: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు కూకట్‌పల్లి డిపోలో కార్మికులు నిరసనకు దిగారు. మంగళవారం కూకట్‌పల్లి డిపో జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి తెలంగాణ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.కమలాకర్ గౌడ్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు ఇచ్చినట్లే ఆర్టీసీకి కూడా ఇచ్చిందన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తి చేస్తానని, రెండు పీఆర్సీల బకాయిలతో సహా చెల్లిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. బస్సులను ఆధునీకరించి అధునాతనమైన సౌకర్యాలతో కొత్త సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారన్నారు. ఆర్టీసీ యూనియన్లను పునరుద్ధరిస్తామని తెలిపారని పేర్కొన్నారు. వచ్చే ప్రభుత్వ పీఆర్సీ పరిధిలోకి టీజీఎస్ఆర్టీసీ కార్మికులను చేరుస్తామని 6 గ్యారంటీలు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9 మాసాలైనా ఒక్క డిమాండ్ కూడా పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి 2023 సెప్టెంబర్ 15న గెజిట్ వెలువడినా రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యకు ఆమోద ముద్ర వేయలేదన్నారు. రావాల్సిన జీతం బకాయిలు కేవలం డ్రైవర్లకే రావడం కండక్టర్లకు రాకపోవడం వలన కండక్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఆర్టీసీ జేసీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు చేస్తుండగా.. దెబ్బ తిన్న తాగునీటి పైప్‌లైన్

తాగునీరు వృథా.. రెండ్రోజులు బంద్

మియాపూర్ , ఆగస్టు 27: డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేస్తుండగా తాగునీటి పైప్‌లైన్ దెబ్బతి తాగునీరు వృథా అయిన ఘటన ఆల్విన్ కాలనీ డివిజన్‌లో చోటుచేసుకున్నది. ఈ పరిస్థితితో ఈ లైన్‌పై తాగునీటికి ఆధార పడ్డ పలు కాలనీలకు రెండు మూడు రోజుల పాటు నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం కనిపిస్తున్నది. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ ప్రధాన రహదారిలో విస్తరణ పనుల నిమిత్తం డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపడుతున్నారు. జేసీబీ యంత్రం సాయంతో తవ్వకం చేపడుతున్న సమయంలో సమీపంలోనే ఉన్న తాగునీటి పైప్‌లైన్ ఒక్కసారిగా దెబ్బతిని గంటల తరబడి పెద్దఎత్తున తాగునీరు రహదారులపై సమీప కాలువల్లోకి వృథాగా పోయింది. ఈ లైన్ ద్వారా సమీపంలోని విజయనగర్, నవోదయ కాలనీలకు తాగునీటి సరఫరా చేపడుతున్నారు. తాజాగా తాగునీటి లైన్ దెబ్బతినడంతో మరమ్మతులు పూర్తయ్యే వరకు ఆ కాలనీలకు తాగునీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉన్నది. అయితే గుత్తేదారు నిర్లక్ష్యం వల్లే తమ తాగునీటి లైన్ దెబ్బతిన్నదనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతిన్న పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

మురుగు సమస్య పరిష్కరించండి

జగద్గిరిగుట్ట, ఆగస్టు 27 : సూరారంకాలనీ రాంలీలా మైదాన్ సమీపంలో మురుగు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు. మంగళవారం స్థానికులు, బీజేపీ నేతలు జల మండలి జీఎం అశోక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రోడ్డుపై మురుగు చేరి వాహనాలు, ప్రజలు తిరుగలేని పరిస్థితి ఉందన్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. పలు సార్లు ఫిర్యాదు చేసినా తాత్కాలిక మరమ్మతులే జరుగుతున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి పరిష్కార మయ్యేలా చూస్తానని జీఎం వారికి తెలిపారు. బీజేపీ నేతలు శ్రీరాములు, సత్యనారాయణ రాజు, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలపై సంక్షేమ సంఘం కన్ను..

- దుండిగల్ మున్సిపాలిటీ సింహపురి కాలనీలో మాయమవుతున్న పార్కులు
- కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానికుల వేడుకోలు

సింహపురి కాలనీ ఏ బ్లాక్‌లోని పార్కు స్థలాన్ని కబ్జా చేసి నిర్మించిన ప్రహరీ

సింహపురి కాలనీ డీ బ్లాక్‌లోని పార్కుస్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చదును చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

దుండిగల్, ఆగస్టు 27: కాలనీ ప్రజల ఆహ్లాదం, చిన్నారులు సేదదీరేందుకు ఏర్పాటు చేసిన పార్కు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. పార్కులను కాపాడాల్సిన సంక్షేమ సంఘం ప్రతినిధులే వాటి భక్షకులుగా మారుతున్నారు. మహానగరంతో పాటు శివారు ప్రాంతాలు సైతం కాంక్రీట్ జంగల్‌గా మారుతున్న తరుణంలో ఎక్కడ ఖాళీ స్థలాలు కనపడినా అక్రమార్కులు వదలడం లేదు. అది పార్కు స్థలమా.. మరేదైనా క్రీడాప్రాంగణం కోసం కేటాయించారా? అనేది ఏమి పట్టించుకుకోకుండా ఎవరికి వారుగా సదరు స్థలాలను విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. గజానికి లక్షల్లో ధరలు పలుకుతుండటంతో పార్కు స్థలాలను గిఫ్ట్‌డీడ్‌ల పేరిట విక్రయిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు పార్కు స్థలాలను పరిరక్షించాల్సిన మున్సిపాలిటీ అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా భవిష్యత్ తరాలు పార్కు స్థలాలు అంటే అలా ఉండేవా? అనే రీతిలో కనుమరుగై పోతున్నాయి. సరిగ్గా ఇటువంటి ఉదంతమే దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట్‌లోని సింహపురి కాలనీలో జరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

దుండిగల్ మున్సిపాలిటీ, బౌరంపేట్‌లోని సింహపురికాలనీ పేరిట 1996లో సుమారు 100 ఎకరాలల్లో లేఅవుట్ వేశారు. లే అవుట్‌లో 10 పార్కుల ఏర్పాటు కోసం 16వేల గజాల పైచిలుకు ఖాళీ స్థలాలను వదిలారు. లే అవుట్ చేసిన సమయంలో ఇక్కడ వందల్లో గజం ధర పలుకగా ప్రస్తుతం రూ.80వేల నుంచి రూ.1లక్ష పైచిలుకు ధర పలుకుతుంది. పైగా ఖాళీ స్థలాలు దొరకడం ఇబ్బందికరంగానే మారింది. దీనిని ఆసరాగా చేసుకున్న సంక్షేమ సంఘం ముఖ్యనేత ఏకంగా పార్కుస్థలాలకు ఎసరుపెట్టాడు. కోర్టు కేసుల ఖర్చుపేరుతో ఏకంగా ' ఏ'బ్లాక్‌లోని పార్కుస్థలం నుంచి ఓ వ్యక్తికి 110 గజాల స్థలాన్ని విక్రయించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పైగా ఎవరికీ అనుమానం రాకుండా దానిని గిఫ్ట్‌డీడ్ చేసినట్లు తెలుస్తుంది. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే దబాస్తున్నారని వాపోతున్నారు. ఇదే విధంగా డీ.బ్లాక్‌లోనూ యూరోకిడ్స్ స్కూల్ వెనుకాల ఉన్న పార్కుస్థలాన్ని సైతం పక్కనున్న ఫ్లాట్ యజమానికి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారని పేర్కొంటున్నారు. గతంలో టెంపుల్ కాంప్లెక్స్ పేరుతో ఒక పార్కు స్థలాన్ని చెరబట్టిన సదరు సంక్షేమసంఘం నేత గణపతి మండపం పేరుతో మరో పార్కు స్థలానికి ఎసరు పెట్టినట్లు ఆరోపిస్తున్నారు. సదరు సంక్షేమ సంఘం నేతతో పడలేక 'ఈ, ఎఫ్' బ్లాకుల వారు విడిపోయారని పేర్కొంటున్నారు. లే అవుట్ వేసిన సమయంలో గుమస్తాగా పనిచేసిన ఆయనకు లే అవుట్‌లోని లోటుపాట్లు అన్ని తెలుసుండటంతో పార్కు స్థలాలను విక్రయించి సొమ్ముచేసుకుంటున్నాడని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఈయన గారు సంక్షేమ సంఘం ముఖ్యనేతగా పనిచేస్తున్న ఈ రెండేండ్ల కాలంలోనే పార్కులన్ని ఒకటిఒకటి కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పార్కు స్థలాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

మియాపూర్, ఆగస్టు 27: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. ఇందుకోసం నూతన పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే కొనసాగుతున్న పనులపై అధికారులు తగు పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన నూతన పనులపై తగు ప్రతిపాదనలను రూపొందించాలని, ఎమ్మెల్యే తోడ్పాటుతో నిధుల మంజూరుకు కృషి చేస్తానని కార్పొరేటర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. మంజూరై ప్రారంభం కాని సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ కేవీఎస్ఎన్ రాజు, డీఈలు ప్రవంతి, దుర్గా ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఘనంగా విజయగణపతి ఆలయం వార్షికోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో శ్రీవిజయ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైంది. మంగళవారం గణపతి పూజ, పుణ్యాహవాచన, రుత్విక్‌రణ, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ స్థాపనాది కార్యక్రమములు, స్వామి వార్లకు మంగళస్నానం, పెండ్లి కుమారుడిని, పెండ్లి కుమార్తెలను చేయడం, సాయంత్రం ధ్వజ పటం కట్టడం, అంకురారోహన, నవగ్రహ మండప, సర్వతో భద్ర మండప దేవతా స్థాపన, అగ్నిప్రతిష్ట, గణపతి హోమం పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు ప్రత్యేక పూజలు చేశారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 27

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జట్లతో బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ తదితరులు

దుండిగల్, ఆగస్టు 27 : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి, బాలానగర్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో బాలానగర్ జోనల్ లెవల్ టోర్నమెంట్ పేరిట నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో బాలానగర్ జోన్‌లోని 8 పీఎస్ పరిధిలోని మొత్తం 40 జట్ల క్రీడాకారులు పాల్గొంటున్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లిలోని గోకరాజు, రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌ను మంగళవారం బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో పోటీతత్వం పెంచడంతోపాటు చెడువ్యసనాల వైపు మళ్లకుండా స్ఫూర్తిని నింపేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి చెందిన బాలికల జట్టుతోపాటు సరూర్‌నగర్ స్పోర్ట్స్ అకాడమీ మహిళల జట్లు పాల్గొని ఆడారు. కార్యక్రమంలో బాలానగర్ జోన్ అదనపు డీసీపీ సత్యనారాయణ, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, బాలానగర్ ఏసీపీ హస్మంతరావు, దుండిగల్ సీఐ జే.ఉపేందర్‌రావుతోపాటు ఎస్ఐలు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్, ఆగస్టు 27: ఇటీవల కురిసిన వర్షాలకు రాజీవ్‌గాంధీనగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్‌లో వ్యర్థాలు పేరుకుపోయి మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయని స్థానికులు కార్పొరేటర్ సబీహాబేగం దృష్టికి తీసుకెళ్లారు. అయితే మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి కార్పొరేటర్